
www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 12 నవంబర్ 2022
7
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





విద్యార్థినికి కలెక్టర్ అభినందనలు



అభినంది స్తున్న కలెక్టర్

నెల్లూరు:నగరానికి చెందిన షేక్ అమీయా ముబీన్ న్యాయ శాస్త్ర విభాగంలో మొదటి స్థానంలో నిలిచి బంగారుపతకం సాధించి నందుకు కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు అభినందించారు. తమిళనాడు లోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో ఈ ఏడాది మేలో జరిగిన పరీక్షల్లో న్యాయ శాస్త్ర విభాగంలో మొదటి ర్యాంకు సాధించారు. ఈనెల 10వ తేదీ గురు వారం అక్కడ జరిగిన స్నాతకోత్సవంలో లోకసభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా చేతుల మీదుగా బంగారు పతకాన్ని, డిగ్రీ పట్టాను అమీయా ముబీన్ అందుకున్నారు. ఆమె శుక్రవారం సాయంత్రం తన తల్లిదండ్రులు న్యాయ వాదులైన షేక్ ఆరిఫ్ మాలిక్, పర్వీన్ కమీల, కలెక్టరేట్ పరిపాలన అధికారి షేక్ షేక్ మాలిక్ లతో కలిసి కలెక్టరు క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చాన్ని అందజేశారు.

సివిల్ సప్లయ్ కేసులో 32మంది..!

డిఎం సివిల్ సప్లయ్ కార్యాలయంలో జరిగిన అవినీతి కేసు వేగవంతమైంది. ఈ కేసును నెల్లూరు ఎసిబికి అప్పగించడంతో డిఎస్‌పి మోహన్ నేతృత్వంలో ఈనెల 6 నుంచి వేగంగా ముందుకు సాగుతోంది. జెసి కూర్మానాధ్ ఇచ్చిన నివేదిక ఆధారంగా 32 మందిని ఈ కేసులో నిందుతులుగా చేర్చినట్లు తెలిసింది. ఇప్పటికే శివకుమార్, పవన్, దయాకర్, శర్మతో పాటు అనేక మంది ఆస్తులను సీజ్ చేశారు. శుక్రవారం ఎంజి మాల్ ఎదురుగా ఉన్న శివకుమార్ బావమర్ది పవన్ బార్‌ను ఎసిబి అధికారులు సీజ్ చేశారు. లైసెన్స్‌ను రద్దు చేశారు. ఈ కేసులో కీలకమైన వ్యక్తి ఉన్న కంప్యూటర్ ఆపరేటర్ ఎస్. శివకుమార్ ప్రస్తుతం జిల్లా జైల్లో ఉన్నారు. విచారణ కోసం నేడో, రేపు ఎసిబి శివకుమార్‌ను కస్టడికి తీసుకోనుంది. ఆయన ఇచ్చే వివరాలు మేరకు అరెస్టులు వేగవంతమయ్యే అవకాశం ఉంది.



ఎస్ఎస్ రెస్టో బార్‌ను సీజ్ చేసిన అధికారులు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సివిల్ సప్లయ్ డిఎం కార్యాలయంలో జరిగిన అవినీతి కేసును రాష్ట్ర ఉన్నతాధికారులు ఎసిబికి అప్పగించారు.రాష్ట్ర ఎసిబి అధికారుల ఆదేశాల మేరకు ఈనెల 6 వతేదీ నుంచి జిల్లా ఎసిబి డిఎస్‌పి మోహన్‌రావు నేతృత్వంలో వేగంగా దర్యాప్తు సాగుతోంది. జెసి కూర్మానాధ్ ఇచ్చిన నివేదిక ఆధారంగా కేసును విచారణ చేస్తున్నారు. తొలుత రూ.29.78 కోట్లు అవినీతిలో 11 మందికి సంబంధాలున్నాయని ఆయన కేసు పెట్టారు. ఆ కేసులో ఇప్పటి వరకు ఆరుగురిని అరెస్ట్ చేసిన విషయం తెలిసింది. జెసి విచారణ అనంతరం మొత్తం 32 మంది, రూ.40 కోట్లు అవినీతి జరిగినట్లు తేల్చారు. 2020-23 సంవత్సరం కాకుండా 2016-17 నుంచి కేసు ముడిపడి ఉండడంతో ఎసిబి అధికారులు ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నారు. కేసు తమ చేతికి రాగానే 10 బృందాలు విచారణ చేశాయి. అందుబాటులోని ఆస్తులను సీజ్ చేశారు. ఇందులో శివకుమార్ ఆస్తులు అత్యధికంగా ఉన్నట్లు గుర్తించారు. సుమారు రూ. 30 కోట్లు వరకు అవినీతికి పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. అక్టోబర్ 14న జెసి 11 మందిపై కేసు పెట్టారు. అటు తరువాత 25న మొత్తం 32 మంది ఉన్నట్లు తన నివేదికలో చేర్చారు. ఇప్పుడు మిగిలిన 21 మందిపైనా కేసు నమోదైట్లు తెలుస్తోంది. ఇందులో గతంలో డిఎంగా పనిచేసిన రోజ్‌మాండ్, కృష్ణారెడ్డితోపాటు అనేక మంది అధికారులు, ఉద్యోగులున్నట్లు తెలుస్తోంది. ఎసిబి అధికారులు దీనిపై దృష్టిపెట్టారు. నెల రోజులు గడిచిపోవడంతో ఎవరు ఎక్కడున్నారో తెలియడం లేదు. అలాగే ఆస్తులు దాచిపెట్టారనే అనుమానాలు ఎసిబి అధికారులకు కలుగుతోంది. అందరి ఆధార్‌కార్డులను స్వీకరిస్తున్నారు. ఆధార్ లింక్‌తో ఉన్న ఆస్తులు మొత్తం సీజ్ చేసే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. భవనాలు, ఇంటి స్థలాలు, ఇతర బాండ్లు ఆధార్‌కు లింకింగ్ ఉన్న ఆస్తులు మొత్తం ఎసిబి సీజ్ చేసే అవకాశాలున్నాయి. ఈ కేసులో కీలకమైన వ్యక్తిగా ఉన్న కంప్యూటర్ ఆపరేటర్ ఎస్. శివకుమార్ భారీగా ఆస్తులు కూడబెట్టారు. ఆయనను



ఎంజిమాల్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు

◆స్పీడ్ పెంచిన ఎసిబి
◆ఎసిబి కస్టడికి శివకుమార్ ?
◆పవన్ బార్ లైసెన్స్ రద్దు
◆దొరికిన ఆస్తులు సీజ్

కస్టడీలోకి తీసుకుంటే మరింత ఉపయోగంగా ఉంటుందని భావించిన ఎసిబి అధికారులు ఆయనను కస్టడీ కోరినట్లు తెలిసింది. నేడో, రేపో ఎసిబి అధీనంలోకి రానున్నారు. వాస్తవాలు ఏమిటో అప్పుడు బయట పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పవన్ బార్ సీజ్..!

సివిల్ సప్లయ్ కేసులో శివకుమార్ బావమర్ది పవన్‌కు చెందిన ఎస్ఎస్ రెస్టో బార్‌ను శుక్రవారం ఉదయం ఎక్సైజ్ పోలీసులు సీజ్ చేశారు. కోవూరు శ్రీనివాసనగర్ ప్రాంతానికి చెందిన పవన్ సుమారు రూ.10 కోట్లు సివిల్ సప్లయ్ ఆస్తులు దిగమింగారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో జెసి నివేదిక ఆధారంగా ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 10 రోజుల క్రితం పవన్‌కు నోటీసులు జారీ చేశారు. సంజాయిషీ ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం పవన్ జిల్లా జైల్లో ఉన్నారు. ఎలాంటి సమాధానం రాకపోవడంతో ఎంజి మాల్ ఎదురుగా ఉన్న బార్ వద్దకు వెళ్లిన అధికారులు రికార్డులు పరిశీలించారు. లైసెన్స్ రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఇక్కడే బార్ నడపడానికి అవకాశం లేదని చెప్పి, తాళాలు వాచ్‌మెన్‌కు ఇచ్చారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పవన్ బార్‌ను లైసెన్స్ రద్దు చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ తెలిపారు.

మెరుగైన వసతులు కల్పించండి

ప్రజాశక్తి-నెల్లూరు




అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలను నాడు- నేడు పథకం కిందన్నిటి మౌలిక వసతులతో సుందరంగా తీర్చిదిద్దేందుకు సిద్ధం కావాలని కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నాడు-నేడు పథకం రెండవ దశ కింద ఎస్సీ, ఎస్టీ,బీసీ సంక్షేమ వసతి గృహాలు గురుకుల పాఠశాలల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నాడు-నేడు పథకం రెండవ దశ కింద జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాలు గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాల్సి ఉంటుందన్నారు. వాటిలో ముఖ్యంగా మరుగుదొడ్లు, విద్యుద్దీకరణ, సాగునీరు, ఫర్నీచర్, రంగులు వేయడం, చిన్న, పెద్ద మరమ్మతులు చేపట్టడం, వంటగది ఆధునీకరణ, ప్రహరీ నిర్మాణం, దోమల నివారణ ఏర్పాట్లు, క్రీడా సామగ్రి గ్రంథాలయ పుస్తకాలు సమకూర్చుట, పరిసరాల పరిశుభ్రత వంటి అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాల్సి ఉంటుందన్నారు. వసతి గృహాలను రెండు దశల్లో, గురుకుల పాఠశాలలను మూడు దశల్లో అభివృద్ధి చేయాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో బిసి, ఎస్సి, సంక్షేమ అధికారి వెంకటయ్య ఐటీడీఏ పీవో మందా రాణి, సర్వ శిక్ష సహాయ ప్రాజెక్టు సమన్వయకర్త ఉషారాణి, గురుకుల పాఠశాలల సమన్వయకర్త హేమలత సర్వ శిక్ష కుమార్ గురుకుల పాఠశాలల ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ ఉపాధ్యాయులదే

నెల్లూరు:పాఠశాలల్లో మొక్కలను నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను కూడా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తీసుకోవాలని కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు సూచించారు.శుక్రవారం రూరల్ పరిధిలోని కనుపర్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న పచ్చ తోరణం పథకంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.తొలుత కనుపర్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుతెన్నులను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం తయారు చేస్తుందీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ద్వారా అడిగి తెలుసుకుని సంతప్తి వ్యక్తం చేశారు. ఇదేవిధంగా ప్రతి రోజు మెనూ ప్రకారం మంచి రుచికరంగా తయారుచేసి అందించవలసినదిగా సంబంధిత సిబ్బందికి సూచించారు. తదుపరి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటడమే కాకుండా, స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగం విద్యార్థులతో మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటిస్తూ, కేవలం మొక్కలను నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను కూడా విద్యార్థులు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో పూర్వ విద్యార్థిగా పాఠశాలను సందర్శించినప్పుడు వారికొక తీపిగుర్తుగా మిగిలిపోతుందన్నారు.ఈ కార్యక్రమంలో సర్వ శిక్ష ఏ పీ ఓ ఉషారాణి, ఇన్చార్జి డీఈవో వి యస్ సుబ్బారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత పాల్గొన్నారు.



ఎఆర్‌సి సెంటర్‌ను ప్రారంభిస్తున్న కంచర్ల రామయ్య

రోబో ఆపరేట్‌పై విద్యార్థులకు శిక్షణ

కందుకూరు: రోబో చేసే పనులను చూసేందుకు పరిమితమైన ప్రకాశం విద్యార్థులకు రోబో తో పనులు చేయించే అపూర్వ అవకాశం దక్కిందని కరస్పాండెంట్ కంచర్ల రామయ్య హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్(ఎపిఎస్‌డిసి) ద్వారా ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం ఏర్పాటైన వర్క్ షాప్ లో ఇండస్ట్రియల్ రోబో ద్వారా విద్యార్థులతో రోబో ఆపరేషన్‌తో వివిధ పనుల ప్రదర్శనలు ఇప్పించారని ప్రిన్సిపల్ సిహెచ్ రవికుమార్ వివరించారు. ప్రోగ్రామింగ్ రిమోట్‌తో రోబోను పని చేయించడం పై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారన్నారు. గత మూడేళ్లుగా ఏపీ ప్రభుత్వం జర్మనీ యూనివర్సిటీ సహకారంతో ప్రకాశంలో ఏర్పాటు చేసిన అప్లయిడ్ రోబోటిక్ సెంటర్(ఎఆర్‌సి) ద్వారా ఏటా వందమంది విద్యార్థులకు నిపుణులతోఈ శిక్షణ ఇస్తున్నామని ప్రిన్సిపల్ వెల్లడించారు. ఏపీలోని ఏఆర్‌సి కేంద్రాలలో చెన్నైకి చెందిన ఎక్సిల్ గ్లీబల్ ఆటోమేషన్ కంపెనీ ప్రతినిధులు రాష్ట్ర ఏపీఎస్ డీసీ ద్వారా వర్క్ షాపులు నిర్వహించడంలో భాగంగా శుక్రవారం తమ కాలేజీలో కరస్పాండెంట్ రామయ్య ప్రారంభించారన్నారు.చెన్నై ఎక్సిల్ ఆటోమేషన్ సాంకేతిక(అప్లికేషన్) ఇంజినీరు ఎం.నాగార్జున విద్యార్థులకు వివరించారు. ఎఆర్‌సి ప్రకాశం ఇన్‌ఛార్జి జి.పున్నారావు, శ్రీకాంత్ మాట్లాడుతూ తమ విద్యార్థులు ఎంతో ఆసక్తితో శిక్షణ పొందుతున్నారని వెల్లడించారు. అకడమిక్ ఇన్‌ఛార్జి ఎస్.ఎం.మీరావలి, ఇసిఇ విభాగపు సాంకేతిక ప్రతినిధి మస్తాన్‌వలీ, ఎక్సిల్ ఆటోమేషన్ ఇంజినీరు ఎస్‌జె.హరిహరన్ పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసు కొట్టివేత

కందుకూరు:గుడ్లూరు మండలం, కొత్తపేట గ్రామంలో జరిగిన హత్యాయత్నం కేసును కందుకూరు అసిస్టెంట్ సెక్షన్స్ జడ్జి ఎన్ విజయ బాబు శుక్రవారం కొట్టివేశారు. 2012 అక్టోబర్ 11వ తేదీన గుడ్లూరు మండలం, కొత్తపేట గ్రామంలో కోణికి గంగరాజు పై హత్యాయత్నం జరిగినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో కొత్తపేట సర్పంచ్ కొణికి గంగయ్య అతని అన్నదమ్ములైన కొణికి మాధవ బాలకష్ణ, సుబ్బారావు, ప్రభాకర్ రావులపై నమోదైన హత్యాయత్నం కేసును విచారించి కేసు రుజువు కాకపోవడంతో జడ్జి విజయ్ బాబు నిర్దోషులుగా పరిగణిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు.

విద్యుత్ బకాయిలు చెల్లించాలి

వలేటివారిపాలెం:గ్రామ పంచాయతీలకు సంబంధించి పెండింగ్‌లోని విద్యుత్ బకాయిలను తక్షణమే చెల్లించేలా సదరు సర్పంచ్‌లతో మాట్లాడి పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంఎల్ఎ మానుగుంట మహీధర్‌రెడ్డి సూచించారు. ఎంపిడిఒ కార్యాలయంలో కార్యదర్శులు, అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ బిల్లులు చెల్లించని పక్షంలో



మాట్లాడుతున్నఎంఎల్ఎ మానుగుంట మహీధర్‌రెడ్డి

రూ.2 మేర వడ్డీ చెల్లించాల్సి వస్తోంద న్నారు.ఇంటి పన్నులు సకాలంలో వసూలు చేయా లన్నారు. చెత్తసేకరణ చేస్తున్న కార్మికులకు జీతాలను 15వ ఆర్థికసంఘం నిధుల నుంచి చెల్లించాలన్నారు. బ్లీచింగ్, సున్నం కందుకూరులో అధిక ధరకు ఎందుకు కొనుగోలు చేస్తున్నారని ప్రశ్నించారు. బ్లీచింగ్ బస్తా బయట ఎ1 గ్రేడ్ రకం రూ.405కు వస్తుంటే, పంచాయతీలు మూడోరకంను రూ.650 చెల్లించి కొనుగోలు చేస్తున్నారని, తద్వారా ప్రజలు పన్నులరూపంలో చెల్లించే నిధులు వృథాగా ఖర్చయిపోతుందన్నారు. సున్నితమైన అంశాలను పరిశీలించి, పంచాయతీలకు ఆదాయం వచ్చే మార్గాలపై కార్యదర్శులు, సర్పంచులు దృష్టి సారించాలన్నారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీలకు విద్యుత్ బిల్లులు ప్రతినెలా ఎంత వస్తుందనే సమాచారం సైతం కార్యదర్శులు చెప్పలేకపోవడంతో వారి పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. తరచుగా సమీక్షలు నిర్వహిస్తున్నా పనితీరులో మార్పు రాకపోతే ఇబ్బంది పడాల్సి వస్తుందని సున్నితంగా హెచ్చరించారు. సమావేశంలో ఎంపిడిఒ షేక్ రఫీక్ అహ్మద్, ఎంపిపి పొనుగోటి మౌనిక, జెడ్‌పిటిసి ఇంటూరి భారతి, అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

కందుకూరు: తిక్కవరపు రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్మీడియట్ చదువుతున్న ద్వితీయ సంవత్సరం విద్యార్థులందరూ కలిసి ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ తొట్టెంపూడి సుబ్బారావు అధ్యక్షత వహించారు. సుబ్బారావు మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఆహ్వానం పలుకు కార్యక్రమంను నిర్వహించటం ఆనందదాయకమన్నారు.మరో సీనియర్ అధ్యాపకులు ఐ వెంకటేశ్వరరావు మాట్లాడారు. ప్రస్తుతం కంప్యూటర్ యుగం నడుస్తుం దన్నారు. అతిథులుగా దండోరా దాసు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు జిలాని బాషా హాజరై విద్యార్థులకు జీవితంలో ఉపయోగపడే సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్‌కె మస్తాన్ వలి, సిహెచ్ రవిబాబు, సిహెచ్ బాబురావు, సిహెచ్ శ్రీనివాసులు ,కాశీరత్నం, పి.ఉష అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

క్రీడాకారులకు అభినందనలు

కందుకూరు: రాష్ట్రస్థాయి టార్గెట్ బాల్ పోటీలకు ప్రకాశం జిల్లా తరఫున పాల్గొంటున్న క్రీడాకారులకు కళాశాల ప్రిన్సిపల్ కదిరి నాగేశ్వరరావు, ఫిజికల్ డైరెక్టర్ సుబ్బారావు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం పీడీ సుబ్బారావు మాట్లాడుతూ నాలుగవ రాష్ట్రస్థాయి టార్గెట్ బాల్ క్రీడలకు ప్రకాశం జిల్లా తరఫున టిఆర్ఆర్ కళాశాలలోని విద్యార్థులు జిల్లాలో విద్యార్థులను కలిపి టీమును క్రీడాకారులను పంపించడం జరిగింది. ఈనెల 12, 13 వైజాగ్ లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపించడం జరిగింది. ఈ క్రీడాకారులకు సిహెచ్ శ్రీనివాసులు, కె.హజరత్తయ్య, బీవీ కాశీరత్నంలో, అధ్యాపక సిబ్బంది అభినందనలు తెలిపారు.

అధికారులకు శిక్షణ తరగతులు

ఉలవపాడు: జిల్లా పంచాయతీ అధికారి నెల్లూరు వారి ఆదేశాల ప్రకారం శుక్రవారం ఉలవపాడు మండల స్త్రీ శక్తి భవనం-వెలుగు కార్యాలయంలో స్వమిత్వ వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం పై అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగింది .ఈ సదస్సులో హనుమంత ప్రసాద్, అడిషనల్ డైరెక్టర్, సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ వారు, ఎల్. చెంచమ్మ, మండల పరిషత్ అభివద్ధి అధికారి, షేక్ మహ్మద్ హుస్సేన్, తహశీల్దార్ శ్రీనివాసరావు, మండల సర్వేయర్, అందరు పంచాయతీ కార్యదర్శులు, అందరు వీఆర్వోలు, అందరు సర్వేయర్లు , అందరు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు , అందరు డిజిటల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.



కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దు

వలేటివారిపాలెం:ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని కందుకూరు శాసనసభ్యులు మానుగుంట మహీధర్‌రెడ్డి రెవెన్యూ అధికారులకు సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి ఎంఎల్ఎ శుక్రవారం వచ్చారు. ఈ సందర్భంగా ప్రజలకు సంబంధించి రెవెన్యూ సంబంధిత సమస్యలపై అర్జీలను తీసుకున్నారు. చుండి రెవెన్యూలో రికార్డు కంటే ఎక్కువ సర్వేనెంబర్లు నమోదు కావడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజలు ఇచ్చిన అర్జీలపై వెంటనే స్పందించాలన్నారు. లేనిపక్షంలో అధికారులపై, వ్యవస్థపై ఆ ప్రభావం పడుతుందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుందరమ్మ, ఆర్ఐ కుంచాల నరసయ్య, విఆర్ఒలు ఉన్నారు. జాతీయ రహదారి 167బికి తాత్కాలిక మరమ్మత్తులకు సంబంధించి రూ.40 లక్షలు నిధులు మంజూరైనట్లు స్పష్టం చేశారు.



మాట్లాడుతున్నఎంఎల్ఎ మానుగుంట

సిపిఎం, సిపిఐ నిరసన

కందుకూరు: ఆంధ్ర ప్రదేశ్ కి అన్యాయం చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గో బ్యాక్ అంటూ సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం కందుకూరు ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట నిరసన జరిగింది. సిపిఐ, సిపిఎం రాష్ట్ర కమీటీల పిలుపులో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పీ. మాలకొండయ్య, సిపిఎం కార్యదర్శి ఎస్ఎ గౌస్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎఐటియుసి నియోజకవర్గ సహాయ కార్యదర్శి నీలిశెట్టి నరసయ్య, షేక్ హుస్సేన్, సిపిఎం నాయకులు దాసరి రామ్మూర్తి, టి వెంకట్రావు, డిఎం మాలకొండ రాయుడు, ఎస్ కే మల్లికా, ఎం ప్రసాద్, బాబురావు పాల్గొన్నారు.




విద్యా హక్కు చట్టాన్ని వినియోగించుకోండి

కందుకూరు: ఉలవపాడు మండలం, కరేడు గ్రామంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల పాముకాటుకు గురైన చిన్నారిని పరామర్శించి వసతి గహంలో ఉన్నటు వంటి సదుపాయాలను పరిశీలించారు. కార్యక్రమంలో సి.డి.పి.ఒ విజయకుమారి,కె.జి.బి.వి పాఠశాల ప్రిన్సిపల్ ఏ. అమత జ్యోత్స్న న్యాయ సేవా సహాయకులు పంతగాని వెంకటేశ్వర్లు, మహిళా పోలీసు సజన, హాస్పిటల్ ఎఎన్ఎం లు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం

గుడ్లూరు :రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింట్ ఆటలు పోటీలు మండలంలోని చేవూరు పంచాయతీ పరిధిలోని రామదూత ఆశ్రమం ఆవరణలో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఆంధ్ర ప్రదేశ్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రకాశం జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో మూడురోజులపాటు ఇక్కడ ఆటల పోటీలు జరుగు తాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఏపీ బాల్ బ్యాడ్మింటన్ ప్రెసిడెంట్ విజయ్ శంకర్ రెడ్డి ప్రధాన కార్యదర్శి ఆరు వెంకట్రావు చైర్మన్ ముప్ప వీర్రాజు ప్రకాశం జిల్లా బాల్ బ్యాడ్మింటన్ ప్రెసిడెంట్ వెంకటస్వామి సెక్రటరీ రామాంజ నేయులు టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి పొట్టేలు మురళి లాంఛనంగా ప్రారంభించారు.



సెంబ్ కార్ప్‌కు '5ఎస్' భద్రతా సర్టిఫికేషన్

తోటపల్లిగూడూరు: మండలం సముద్ర తీర ప్రాంతంలో గల సెంబ్ కార్ప్ఎనర్జీ ఇండియా లిమిటెడ్‌కు "5ఎస్" సర్టిఫికేషన్ లభించింది. కంపెనీ అత్యంత భద్రతా ప్రమాణాలను పాటిస్తున్నట్లు క్వాలిటీ సర్కిల్ ఫోరమ్ ఆఫ్ ఇండియా అనే సంస్థ గుర్తించింది. దాంతో శుక్రవారం సెంబ్ కార్ప్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ కంపెనీకి "5 ఎస్" సర్టిఫికేషన్ అందించింది. కంపెనీలో సమగ్రమైన ఆడిటింగ్ నిర్వహించిన అనంతరం ఈ సర్టిఫికేషన్‌ను జారీ చేశారు. ఈ సందర్భంగా సెంబ్ కార్ప్ ప్లాంట్ హెడ్ రమేష్ రామన్‌కు సర్టిఫికెట్‌ను 5ఎస్ సంస్థ ప్రతినిధులు అందజేశారు.



రవీంద్రభారతి స్కూల్‌కు షోకాజ్ నోటీసు

నెల్లూరు :స్థానిక నవాబ్ పేటలోని శ్రీ రవీంద్ర భారతి స్కూలుకు రాష్ట్ర విద్యాశాఖ, ఆర్‌జెడి అధికారులు షోకాజ్ నోటీసు అందజేయడమే కాకుండా గాయపడిన విద్యార్థికి మెరుగైన వైద్యసేవలందించేందుకు చర్యలు తీసుకోవాలంటూ పాఠశాల యాజమాన్ని ఆదేశించింది. ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిపై స్కూలు ఉపాధ్యాయులు కొట్టడం విద్యార్థి కన్ను దెబ్బ తినడంపై విద్యార్థి తల్లిదండ్రులతో రెండవ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం అందరికీ తెలిసిందే. ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ పేరెంట్స్ అసోసియేషన్ సభ్యులు.రాష్ట్ర విద్యాశాఖ మంత్రి దృష్టికి, గుంటూరులోని పాఠశాల విద్యాశాఖ ఆర్జెడి అధికారికి ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, ఆర్‌జెడిలు విచారణకు ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగా జిల్లా అధికారులు శ్రీ రవీంద్ర భారతి స్కూల్ యాజమాన్యానికి షోకాజ్ నోటీసు జారీ చేయడమే కాక విద్యార్థికి పాఠశాల యాజమాన్యం తమ సొంత ఖర్చులతో మద్రాసు నగరంలో వైద్యం చేయించాలని ఆదేశాలు జారీ చేసింది.

విద్యావ్యవస్థను మెరుగుపరిచిన మహనీయులు

నెల్లూరు :భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మన దేశంలో విద్యా వ్యవస్థ పటిష్టతకు, విద్యా వ్యవస్థను మెరుగుపరిచేందుకు కృషి చేసిన మహనీయులు భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు.భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ 135వ జయంతి కార్యక్రమం శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలోని తిక్కన ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ కె.వి.ఎన్ చక్రధర్ బాబు, నగర మేయర్ పోట్లూరి స్రవంతి, ఆప్కాస్ చైర్పర్సన్ షేక్ సైదాని, ముస్లీమ్ సంచార జాతుల వెల్ఫరే కార్పొరేషన్ చైర్ పర్సన్ సయ్యద్ ఆసిఫా, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ లతో కలసి భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు.కార్యక్రమంలో ఆర్.డి.ఓ మాలోల, విద్యా శాఖ ఆర్.జె.డి సుబ్బారావు, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి కనక దుర్గా భవానీ, జిల్లా పరిషత్ సి.ఈ.ఓ చిరంజీవి, సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఉషారాణి, డి.ఎస్.డబ్ల్యూ.ఓ వెంకటయ్య, ఐసిడిఎస్ పిడి సౌజన్య, పలువురు ముస్లిం మత పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పక్కాగా ఇంటింటి సర్వే

నెల్లూరు: జిల్లాలో కుష్టు వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి సకాలంలో వైద్య సేవలు అందించాలని, ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో కుష్టు వ్యాధి నిర్మూలనపై జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లాలో కుష్టు వ్యాధి నిర్మూలనకు చేపట్టాల్సిన కార్యక్రమాలు, లక్షణాలను గుర్తించడం, చికిత్స అందించడం వంటి అంశాలపై జిల్లా వైద్యాధికారి పెంచలయ్య కమిటీ సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 15 నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు కుష్టు వ్యాధి ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వాలంటీర్లు జాగ్రత్తగా చేపట్టాలన్నారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వారికి సకాలంలో వైద్య సేవలు అందించాలన్నారు. ఈ సర్వే కార్యక్రమాన్ని ప్రత్యేక అధికారులు, వైద్య సిబ్బంది పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లాలో కుష్టు వ్యాధి ప్రబలకుండా, అన్ని ముందస్తు చర్యలు చేపట్టేందుకు ఈ సర్వే ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి, వారి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకొని ఎవరికైనా కుష్టు వ్యాధి లక్షణాలు ఉంటే వారిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లి పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించాలన్నారు.కార్యక్రమంలో జెడ్‌పి సిఈఒ చిరంజీవి, డిపిఒ ధనలక్ష్మి, డిఎంఒ హుస్సేనమ్మ, ఎన్‌హెచ్‌ఎం డిస్ట్రిక్ ప్రోగ్రాం ఆఫీసర్ సతీష్ చంద్ర, డాక్టర్ కె పవిత్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన పారిశుధ్య నిర్వహణకు కృషి

నెల్లూరు :వర్షాకాలపు సమస్యలను దృష్టిలో ఉంచుకుని సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శులు స్థానికంగా మెరుగైన పారిశుధ్య సేవలు అందించేందుకు కషి చేయాలని, విధుల పట్ల నిబద్ధతతో వ్యవహరించి క్షేత్రస్థాయి వరకు ప్రజలకు సంక్షేమం అందేలా బాధ్యత వహించాలని కమిషనర్ హరిత సూచించారు. స్థానిక 23/1, 23/2 రాజు వారి వీధి, పోలేరమ్మ చెరువు వీధి సచివాలయాలను కమిషనర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో సంక్షేమ పథకాల అమలు రికార్డులను, సిబ్బంది హాజరును పరిశీలించి, సచివాలయం పరిధిలోని గహాలు, కమర్షియల్ భవనాలన్నింటికీ చెత్త సేకరణ బిన్స్ పంపిణీ చేశారా అని విచారించారు.



మాట్లాడుతున్న కమిషనర్ హరిత

నిర్మాణ పనులు వేగవంతం

నెల్లూరు:సఫాయీ మిత్ర సురక్షా ఛాలెంజ్ కోటి రూపాయల నిధులతో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో బి.వి.ఎస్ బాలికల పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులను వేగవంతం చేసి అతి త్వరలో విద్యార్థులకు అందుబాటులో తేనున్నామని కమిషనర్ హరిత తెలియజేశారు. స్థానిక 7 వ డివిజన్ బి.వి నగర్ లోని పాఠశాలను కమిషనర్ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు ఉన్నత స్థాయిలో ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు.కార్యక్రమంలో ఈ.ఈ చంద్రయ్య, ఏ.ఈ మాధవి పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

నెల్లూరు :జిల్లాలో ఈనెల 12వ తేదీన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి శ్రీ ఎం .శ్రీనివాసులు నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు.జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూఢిల్లీ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల మేరకు జిల్లాలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గౌరవ సి. యామిని అధ్యక్షతన ఈనెల 12వ తేదీన నగరంలోని న్యాయస్థానాల సముదాయం లో గల న్యాయ సేవా సదన్ లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వివరించారు.

ఎస్ఇబి కార్యాలయంలో జెడి శ్రీలక్ష్మి తనిఖీ

ప్రజాశక్తి-ఉదయగిరి : ఉదయగిరి ఎస్ఇబి కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ శ్రీలక్ష్మి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా సమాజంలో అక్రమ రవాణా అరికట్టేందుకు ఎస్ఇబి కార్యాలయాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణకిషోర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రొమ్ము కేన్సర్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-అల్లూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం రొమ్ము కేన్సర్‌పై మహిళలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడారు. జిల్లా ప్రభుత్వ వైద్యశాల నుండి డాక్టర్లు రోజారమణి, చిరిమళ్ల రమణయ్య, రమేష్ విచ్చేసి పరీక్షలు నిర్వహించిన అనంతరం అనేక సూచనలు సలహాలు అందజేశారని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్లు కళారాణి, రాజ్యలక్ష్మి, రమేష్ తదితరులున్నారు.

ఎంఎల్ఎ ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-సీతారామపురం : మండలంలోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన ఘుటిక సిద్ధేశ్వరంలో శుక్రవారం ఉదయగిరి ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, నియోజకవర్గ వైసిపి ప్రచార కార్యదర్శి శాంతి కుమారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు,ఆలయ కమిటీలు ఎంఎల్ఎ చంద్రశేఖర్‌రెడ్డిని, శాంతి కుమారిని పూల మాల, శాలువాలతో సత్కరించారు.

ఉపాధ్యాయులకు అవార్డులు అందజేత

ప్రజాశక్తి-ఉదయగిరి : మైనారిటీల సంక్షేమ జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డును జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు చేతుల మీదుగా ఉదయగిరి ఎంపిపిఎస్ ఉర్దూ స్కూల్ షబ్బీర్ కాలనీ ఉపాధ్యాయులు మున్న అందుకున్నారు. శుక్రవారం నెల్లూరులోని తిక్కన భవన్‌లో స్వాతంత్ర్య సమరయోధులు, భారతరత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి వేడుకలను మైనారిటీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న కలెక్టర్ ఉపాధ్యాయులకు ఉత్తమ అవార్డులను అందజేశారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన

ప్రజాశక్తి-అల్లూరు : మండలంలోని నార్త్ మోపూరు గిరిజన కాలనీలో శుక్రవారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో (హెచ్ఐవి) ఎయిడ్స్ వ్యాధిపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. కళాకారులు ఎయిడ్స్, క్షయ వ్యాధి నిర్మూలన, సంక్రమణంపై నాటక రూపంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ సూపర్‌వైజర్ కేజీయ లింక్ వర్కర్ చందన మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

అంత్యక్రియలో పాల్గొన్న బీద రవిచంద్ర, సోమిరెడ్డి

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం [illegible] పంచాయతీ మాజీ సర్పంచ్ చల్లా శీనయ్య అంత్యక్రియల్లో శుక్రవారం టిడిపి జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర, పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు హాజరై వారి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వీరితోపాటు బోగోలు మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు, బల్లవోలు సుధీర్ బాబు, ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితురాలికి వైసిపి ఆర్థికసాయం

ప్రజాశక్తి-కలిగిరి : మండలంలోని వేలూరిపాలెం ఎస్సీ కాలనీలో [illegible] లక్ష్మమ్మ వృద్ధ మహిళకు రూ.7000 ఆర్థిక సాయాన్ని వైసిపి నాయకులు శుక్రవారం అందజేశారు. గడపగడపకు కార్యక్రమంలో భాగంగా వృద్ధ మహిళ ఆరోగ్యపరిస్థితి లేదని హాస్పిటల్ కార్డ్ సాయం చేయాలని ఉదయగిరి ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి కోరారు. ఆ నగదును ఎంపిపి కాటం రవీంద్రరెడ్డి చేతుల మీదుగా ఇవ్వమని పంపారు. మల్లు రియాజ్ రెడ్డి, ఎ.తిరుపాలున్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సంగం : స్థానిక జెడ్‌పి హైస్కూల్లో లైబ్రేరియన్ రవీంద్రారెడ్డి ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాల గోడ పత్రికను విడుదల చేశారు. అనంతరం గ్రంథాలయ వారోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 14 నుండి 20వ తేదీ వరకు గ్రంథాలయంలో జరిగే 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలన్నారు.

ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-సంగం : మండలంలోని తరుణవాయి గ్రామంలోని ఎస్‌టి కాలనీలో శుక్రవారం హౌసింగ్ ఎఇ కరీముల్లా ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించే కార్యక్రమాన్ని నిర్వహించారు. పిఎంఎవైజి పథకంలో భాగంగా చేపడుతున్న ఈ పనులకు వైసిపి నాయకులు తుంగా దయాకర్ రెడ్డి, బాలనాయుడు పాల్గొని లబ్ధిదారులతో కలిసి ప్రత్యేకపూజలు నిర్వహించి ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. నాయకులు కోటారెడ్డి, మురళి, కృష్ణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న గృహాల మోసాలను బహిర్గతం చేస్తాం..!

ప్రజాశక్తి-కోవూరు : గృహాలు లేని పేదలకు గృహాలు కేటాయింపులో జరుగుతున్న మోసాలను జనసేన పార్టీ ఆధ్వర్యంలో బహిర్గతం చేస్తామని ఆ పార్టీ నియోజక వర్గ ఇన్‌ఛార్జి అలహరి సుధాకర్ స్పష్టం చేశారు. శుక్రవారం రైల్వే రోడ్డులోని జర్నలిస్ట్ క్లబ్‌లో మీడియా ప్రతినిధులతో పలు అంశాలు వెల్లడించారు. జిల్లా కార్యదర్శి సమ్మను వెంకట సుబ్బయ్య, టౌన్ అధ్యక్షులు సాయి విశాల్, కోశాధికారి సుధీర్ [illegible] కృష్ణయ్య, మధు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పంటలు పరిశీలన

ప్రజాశక్తి-సీతారామపురం : సీతారామపురం బిట్-1, బిట్-2 రైతు భరోసా కేంద్రాల పరిధిలోని పలు పంటలను మండల వ్యవసాయ అధికారి పి. చెన్నారెడ్డి పరిశీలించారు. అనంతరం ఆయన రెండు రైతు భరోసా కేంద్రాలలో రికార్డులను పరిశీలించి మాట్లాడారు. [illegible] పాల్గొన్నారు.

టిడిపి నేతల సమీక్షా సమావేశం

ప్రజాశక్తి-కలిగిరి : ఉదయగిరి నియోజకవర్గ ఎస్సీసెల్ కార్యవర్గ సమావేశం కలిగిరిలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు స్వర్ణ కొండయ్య అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి నెల్లూరు పార్లమెంట్ ఎస్సీసెల్ అధ్యక్షులు కాకి ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో బొగ్గవరపు వేణు, నల్లిపోగు రాజు, గంగపట్ల వెంగయ్య, పచ్చ తిమోతి, ఉప్పుటూరి సుధీర్ బాబు, [illegible] మాల్యాద్రి, సతీష్, ఉదయగిరి భీమయ్య, తదితరులున్నారు.

గీతాంజలిలో ముగిసిన వర్క్‌షాప్

ప్రజాశక్తి-కోవూరు : జిల్లాలోని ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాల గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎ.పి.ఎస్.ఎస్.డి.సి) సంయుక్త ఆధ్వర్యంలో 7వ తేదీన ప్రారంభమైన బిల్డింగ్ డ్రాఫ్టింగ్ యూసింగ్ ఆటోక్యాడ్ వర్క్‌షాప్ నేటితో ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సందీప్‌కుమార్ ప్రశంసలు తెలియజేశారు. కార్యక్రమంలో సివిల్ విభాగాధిపతి పి.ఉమామహేశ్వర్లు, ఎ.ఐ.సి.సి అధిపతి పి చక్రపాణి, సమన్వయకర్త వి.రాధాకృష్ణ, శిక్షకులు బ్రహ్మారెడ్డి, కె.శ్రీకాంత్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.85వేల ఆర్థికసాయం

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణంలోని వెంకటేశ్వరపురంలో నివాసం ఉంటున్న సుకన్య అనే యువతికి రెండు సంవత్సరాల క్రితం కిడ్నీ ఇన్ఫెక్షన్ సోకింది. దీని కారణంగా సుకన్య వారానికి మూడుసార్లు డయాలసిస్ చేయాలని, మందుల ఖర్చులు కూడా పెద్ద మొత్తంలో అవుతాయని తెలియజేశారు. సుకన్య భర్త ఒక ప్రైవేట్ కంపెనీలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నారు. సుకన్య వైద్యానికి ఆర్థిక సహాయ నిమిత్తం మన సేవియర్స్ వాలంటరీ ఆర్గనైజేషన్ సభ్యులను సంప్రదించారు. దీనికి స్పందిస్తూ కేవలం రెండు రోజుల్లోనే వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా రూ.85 వేలు సేకరించి చికిత్స అందించారు. సభ్యులు సౌందర్యదీపక్ లిఖిత, శ్రవణి, రాజేష్, విలిల్, పాల్గొన్నారు.

బ్లాక్ మార్కెట్‌లో విత్తనాలు అమ్మకం

ప్రజాశక్తి-కొడవలూరు : రైతులకు అందాల్సిన విత్తనాలు వైసిపి ప్రభుత్వం బ్లాక్ మార్కెట్లో అమ్ముకుంటుందని మాజీ ఎంఎల్ఎ పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మండలంలోని నార్తురాజుపాలెం నేషనల్ హైవే పక్కన ఉన్న బొప్పాయి పంట కాలువను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ కాలువ పారుదల కింద పండల ఎకరాలు ఉన్నాయని రైతులు తెలిపారు. కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, ఇంతా మల్లారెడ్డి, మాతూరు శ్రీనివాసులురెడ్డి, మదన్‌మోహన్, కృష్ణ చైతన్య, దయాకర్ రెడ్డి, కరకటి మల్లికార్జున, నాశం ప్రసాద్, పోలంరెడ్డి వెంకటేశ్వర్లు రెడ్డి, చెముకుల వెంకయ్య, బాలాజీ, బొన్న శివకుమార్, వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు పట్టణంలోని ఎస్ఎఫ్ఐ 14 మందితో శుక్రవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులుగా రాజేష్, బాలాజీ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా అనిల్, దావూద్, సహాయ కార్యదర్శులుగా మనీ, వంశీ, అశోక్, నంద, ఖాదర్ బాషా, తదితరులు ఎన్నుకున్నారు. బాలాజీ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను పరిష్కరించేవిధంగా తమవంతు పోరాడుతామన్నారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చాలి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : నూరు శాతం అక్షరాస్యత సాధనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వయోజన విద్య ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వి.ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో అక్షర చైతన్య రెండవ విడత శిక్షణ తరగతులు జరిగాయి. **వలేటివారిపాలెం** : మండలంలోని నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఎంపిడిఒ షేక్ రఫీక్‌అహ్మద్ సూచించారు. ఎంపిడిఒ ఆఫీసులో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎంపిపి పొనుగోటి మౌనిక, జెడ్‌పిటిసి ఇంటూరి భారతి, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

విశాఖఉక్కు ప్రయివేటీకరణను ఆపాలి

- సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన



ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కావలి

రాష్ట్రంలో ఉన్న విశాఖ ఉక్కు ప్రయివేటుకరణ ఆపాలని సిపిఎం రాష్ట్ర పార్టీ పిలుపులో భాగంగా శుక్రవారం కావలి ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాలో సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రంలో ఉన్న ప్రధాన ఉక్కు పరిశ్రమను బడా పారిశ్రా మికవేత్త ఆదానికి అప్పగించడం అన్యాయమన్నారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు 16 వేల మంది రైతులు భూములు ఇచ్చారని, 34మంది ప్రాణ త్యాగం చేశారని తెలిపారు. అంతేకాకుండా ప్రజలు పోరాడి సాధించుకున్నారని ఈ పరిశ్రమలో ఇప్పుడు వేల మంది ఉద్యోగులు, కార్మికులు పనులు చేస్తున్నారన్నారు. ఇలాంటి పరిశ్రమను ప్రయివేటీకరిస్తే రాబోవు రోజులలో బడుగు బలహీన వర్గాల పిల్లలకు ఉద్యోగ అవకాశాలు లేకుండా పోతాయన్నారు. ఈ పరిశ్రమ ప్రయివేటీకరించొద్దని సంవత్సరాలుగా అక్కడ ఆందోళన కొనసాగుతుందన్నారు. అయినా కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరణ చేసేందుకు ఉబలాటపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నెల్లూరు జిల్లాలో ఉన్న దామోదర సంజీవయ్య విద్యుత్ ప్లాంట్‌ను ఆదానికి అప్పగించాలని చూడడం చాలా దుర్మార్గమైన విషయమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరణ విధానాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించకుండా ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందన్నారు. ఈ రెండు ప్రభుత్వాలు ప్రయివేటీకరణ విధానాలను ఆపాలని డిమాండ్ చేశారు. ప్రయివేటీకరణ ప్రజా వ్యతిరేక విధానాలకు రాబోవు రోజులలో పోరాటాలే తగిన గుణపాఠం ఈ రెండు ప్రభుత్వాలకు చెబుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ఎస్. వెంకయ్య, జి మధుసూదన్ రావు, యర్రంశెట్టి కృష్ణమోహన్, పి.పెంచల నరసింహ, నాయకులు బి.కృష్ణయ్య, ఎస్.కె.మస్తాన్, ఓ.రమేష్, డివైఎఫ్ఐ నాయకులు సిహెచ్ వెంకీ, పి.శ్రీనివాసులు, వి.బాబురావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించాలని, అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మాజీమంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని ఎంజిఆర్ ఫౌండేషన్ తరపున కళాశాల, పాఠశాల విద్యార్థులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు శుక్రవారం ఆత్మకూరు ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, ఎంపిపి కేతా వేణుగోపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ శ్రావణ్‌కుమార్, షేక్.సర్దార్, పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనందరెడ్డి, సూరా భాస్కర్ రెడ్డి, మహబూబ్ బాషా, కొండ వెంకటేశ్వర్లు, సయ్యద్ జమీర్, ఇందూరు వెంకటరమణారెడ్డి, మల్లికార్జున తదితరులున్నారు.

విత్తనాలు అందుబాటులో ఉంచాలి



ప్రజాశక్తి-దగదర్తి : రైతులకు విత్తనాలు ఎరువులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపిపి అధ్యక్షులు తాళ్లూరి వెంకటకృష్ణ ప్రసాద్ నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల పంటలు సాగుచేసే సమయంలో ఎంతోకొంత చేదోడుగా ఉంటుందని ప్రభుత్వం రైతు భరోసా కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. కార్యక్రమంలో కావలి ఎడి కన్నయ్య, దగదర్తి వ్యవసాయ అధికారి ఎస్.కె అబ్దుల్ రహీం, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వింజిం వెంకటేశ్వర్లు, గ్రామ వ్యవసాయ సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికవర్గం ఐక్యంగా ఉద్యమించాలి

ప్రజాశక్తి-ఇందుకూరుపేట


నూతనంగా ఎన్నికైన కమిటీ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయడానికి కార్మికులు ఉద్యమించాలని జిల్లా సిఐటియు అధ్యక్షులు టివివి ప్రసాద్ పిలుపునిచ్చారు. మండలంలోని జగదేవిపేటలో శుక్రవారం సిఐటియు మండల మహాసభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. దీనికి రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం వంతపాడడం విడ్డూరంగా ఉందని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెడుతున్నాడని దుయ్యబట్టారు. ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు రాజా, సిఐటియు లీగల్ అడ్వైజర్ శ్యామ్‌రెడ్డి మాట్లాడుతూ రవాణారంగం కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ప్రభుత్వం ఆదుకోవాలని పెట్రోల్ డీజిల్ రేట్లను నియంత్రించాలని డిమాండ్ చేశారు. 16మంది సభ్యులతో మండల నూతన కమిటీ ఎన్నికైంది. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఏ.మురళి అధ్యక్షురాలు కృష్ణమ్మ పాల్గొన్నారు.

గౌతమ్‌రెడ్డి విగ్రహానికి ఘన నివాళులు

ప్రజాశక్తి-ఉదయగిరి



సంగం మేకపాటి గౌతమ్‌రెడ్డి బ్యారేజ్ వద్ద ఉన్న మేకపాటి గౌతమ్‌రెడ్డి విగ్రహానికి శుక్రవారం ఆయన తనయుడు కృష్ణార్జున రెడ్డి, మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్ రెడ్డి, జెడ్‌పి కోఆప్టెడ్ సభ్యులు షేక్ గాజుల తాజుద్దీన్ పూలమాల వేసి మేకపాటి కుటుంబ సభ్యులు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెట్ట మండలాల అభివృద్ధి చేసేందుకు స్వర్గీయ ఐటిఐ పారిశ్రామిక మంత్రి గౌతమ్‌రెడ్డి ఫ్యాక్టరీ ల ఏర్పాటుకు అనేక కష్టి చేశారని గుర్తు చేశారు. ఆయన ఆశ సాధనాలు నెరవేర్చేందుకు మేకపాటి కుటుంబం మెట్ట ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి ఉంటుందన్నారు. తండ్రికి తగ్గ తనయుడిగా ఇతర రాష్ట్రాలకు సంక్షేమ పథకాల ఆదర్శప్రాయుడిగా ప్రజల హృదయాలలో చిరస్థాయి ముద్రగా నిలిచిన ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిలిచారన్నారు.

ప్లాస్టిక్ రహిత విధానంపై అవగాహన

ప్రజాశక్తి-కావలి : స్థానిక విట్స్ కళాశాలలో ఈసీఈ గ్రూప్ తృతీయ సంవత్సరం విద్యార్థులు అకాడమిక్‌లో భాగంగా జిల్లాలోని బిట్రగుంట, కోవూరుపల్లి, గుళ్ల పాలెం గ్రామాలలో ప్లాస్టిక్ రహిత విధానంపై అవగాహన కల్పించి, ఆరోగ్యం కోసం సమతుల్య ఆహారం పై అవగాహనతో పాటు రక్త దాన శిబిరం, మొక్కలు నాటడం వంటి సామాజిక ప్రయోజనం కోసం అవసరమైన కార్యక్రమాలు చేపట్టారు. ఇందుకు ఆయా గ్రామాల ప్రజలు, అధికారులు సంహరించారు. కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఈసీఈ విభాగధిపతితో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలుచోట్ల గడపగడపకు మన ప్రభుత్వం


నవరత్నాలతో ప్రతికుటుంబానికి లబ్ధి

ప్రజాశక్తి-వింజమూరు : జగనన్న ప్రవేశపెట్టిన నవరత్నాల ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని ఉదయగిరి ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బుక్కాపురం సచివాలయం పరిధిలోని చంద్రపడియ తోగటపాలెం గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని వైసిపి మండల కన్వీనర్ రేవునూరి శ్రీనివాసులురెడ్డి సౌజన్యంతో గ్రామ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొని గడపగడపకు తిరిగి వైసిపి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం ద్వారా ఎంత లబ్ధి చేకూరిందో.. వివరించారు. గ్రామంలోని అంతర్గత రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్, మంచినీటి, సమస్య తదితర సమస్యలను గ్రామంలోని వారు ఎంఎల్ఎ దృష్టికి తీసుకొచ్చారు. ఎంపిపి ఇనగనూరి మోహన్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ జూపల్లి రాజారావు, సర్పంచ్ చెరుకూరి రసూల్, ఉప సర్పంచ్ కాటం రమణారెడ్డి, ఎంపిటిసి కాటం ప్రసన్న, ఎంపిడిఒ స్వరూపారాణి, బయ్యపురెడ్డి విజయ్ కృష్ణారెడ్డి, మద్దూరు చిన్ని కృష్ణారెడ్డి, లెక్కల విజయభాస్కర్ రెడ్డి, అన్నపురెడ్డి శ్రీనివాసులురెడ్డి, నరసింహారెడ్డి, నాయకులు, తదితరులు ఉన్నారు.

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే శాశ్వతంగా అధికారంలో ఉండేందుకు తోడ్పతాయని కోవూరు ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రేబాల గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపిడిఒ నరసింహారావు, తహశీల్దారు ప్రమీల, ఎంపిపి మన్నేపల్లి శ్రీనివాసులు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజామురళి, జొన్నవాడ దేవస్థానం చైర్మన్ పుట్టాలక్ష్మి సుబ్రహ్మణ్యం నాయుడు, నాయకులు ఎర్రంరెడ్డి గోవర్ధన్ రెడ్డి, సతీష్ రెడ్డి, మోర్ల మురళి, చీర్ల ప్రసాద్ యాదవ్, లగుంతోటి భాగ్యలక్ష్మి, మస్తానయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి ఆత్మకూరు అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం వారి సంక్షేమమే పరమావధిగా భావించి ప్రతిష్టాత్మకంగా నవరత్నాల పథకాలు ప్రవేశపెట్టారని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆత్మకూరు మున్సిపాలిటీ 6, 10, 11 వార్డుల సచివాలయ పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంఎల్ఎ తొలుత సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో సమీక్షించారు. అనంతరం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలోనాయకులు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి

ప్రజాశక్తి-కోవూరు: మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా మండపేట సెంటర్లో సీతాపోలయ్య సిపిఎం కార్యాలయంలో శుక్రవారం ఆవాజ్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆవాజ్ జిల్లా కమిటీ సభ్యులు చాన్‌బాషా మాట్లాడారు. డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు సురేంద్ర ఆవాజ్ పట్టణ కమిటీ కార్యదర్శి కరిముల్లా, ఎస్ కే బాబు, ఎస్‌కె కాలేషా, సర్దార్ అహ్మద్, జావిద్, అబ్దుల్, ఉమాయన్, ఎస్‌కె కాలేషా పాల్గొన్నారు.

నెల్లూరు : ఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 135వ జయంతిని బాలాజీ నగర్ వద్ద టాక్సీ స్టాండ్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవాజ్ సభ్యులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ రఫీ, షేక్ రషీద్ లు మాట్లాడారు.

నెల్లూరు : కొండాయపాలెంలోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఘనంగా జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి ఉపాధ్యాయులు విద్యార్థులు కలసి పుష్పాంజలి అర్పించారు.

ఉలవపాడు ఉలవపాడులో శుక్రవారం జి.వి.ఎస్. ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మౌలానా కలాం ఆజాద్ జయంతి సందర్భంగా చరిత్ర విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ డాక్టర్ జి.లక్ష్మీ సుధారాణి అధ్యక్షతన జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

కందుకూరు : ఫైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం జయంతి కార్యక్రమం శుక్రవారం కందుకూరు ఫైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టిఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. టిఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ రవికుమార్, రఫీ, ముస్లిం వెల్ఫేర్ అధ్యక్షులు కరిముల్లా, ప్రభుత్వ ఖాజీ సయ్యద్, పిఈటి కరిముల్లా, నయీమ్, బాబు, కళాశాల సిబ్బంది ఉన్నారు.

సిఐటియు మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : 13వ తేదీన నిర్వహిస్తున్న సిఐటియు మండల 2వ మహాసభను జయప్రదం చేయాలని మండల కార్యదర్శి వేగూరు వెంకయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం నరుకూరు సెంటర్‌లోని జక్కా వెంకయ్య స్మారక సిఐటియు కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ 13వ తేదీ ఉదయం 10 గంటలకు సిఐటియు రెండవ మహాసభ జరుగుతుందని తెలిపారు.

బాధితుడికి చేయూత

ప్రజాశక్తి-కావలి : పాతూరుకు చెందిన పాలపర్తి శ్రీనివాసులు అనే వ్యక్తికి ఆనారోగ్య కారణం వల్ల కాలికి ఇన్ఫెక్షన్ వచ్చి కావలి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్లో గతవారం నుంచి ఉన్నారు. వీరికి కావలి బ్రాహ్మణ సంఘం తరపున, వారి అభ్యర్థన మేరకు రూ.20వేలు దాతల సహకారంతో శుక్రవారం అందించారు. ప్రెసిడెంట్ పివిఎస్ ప్రసాదు, ఏవి రమణమూర్తి, టీవీ ఎంఎన్ ప్రకాష్, మధు సూదన్ రావు, ఎన్ శ్రీహరిరావు, తెలకపల్లి శ్రీనివాసులు, తెలకపల్లి రమేష్, బెస్ట్ ప్రసాద్, శర్మ, ఎం వి ఎస్ రాజేంద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

డిఎస్‌పికి అభినందనలు

ప్రజాశక్తి-కావలి : కావలి నూతన డిఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించిన ఎం.వెంకటరమణను కావలి ఉమెన్ ఫోర్స్ తర్ఫున కన్వీనర్ సి.శారద, ప్రెసిడెంట్ ఎస్. ప్రభావతి, రాష్ట్ర దళిత గిరిజనుల సంక్షేమ సంఘం నేతలు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి.కి శాలువాతో పూలబొకేతో అఖిల భారత దళిత గిరిజనుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దావులూరి శ్యామ్‌సన్, ప్రధాన కార్యదర్శి దావులూరు సన్నీ, జిల్లా కార్యదర్శి దావులూరి జేమ్స్, తదితరులు సత్కరించారు.

రైల్వే స్టేషన్‌లో సిఎంఎస్ తనిఖీ

ప్రజాశక్తి-బిట్రగుంట : బిట్రగుంట రైల్వే స్టేషన్‌ను విజయవాడ డివిజన్ సెక్షన్ రైల్వే మెడికల్ ఆఫీసర్ సిఎంఎస్ డాక్టర్ శ్రీలక్ష్మి శుక్రవారం పలుచోట్ల తనిఖీలు నిర్వహించారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రహంతుల్లాతో కలిసి రైల్వే స్టేషన్‌లోని ఆహార పదార్థాలను పరిశీలించారు. రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలను శుభ్రంగా చూసుకోవాలని హెల్త్ యూనిట్ ఇన్‌ఛార్జి లలిత్‌ను సూచించారు.

హుండీ ఆదాయం రూ.కోటి

వలేటివారిపాలెం : మండలంలోని మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంకు సంబంధించి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకల లెక్కింపు శుక్రవారం కొండపై జరిగింది. హుండీల ద్వారా రూ.1,13,43,444 కోట్లు నగదు, బంగారం 472 గ్రాములు, వెండి కేజీ 890 గ్రాములు వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ కెబి శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా విదేశీ కరెన్సీ యుఎస్ డాలర్స్ 140, కెనడా పది, ఇంగ్లండ్ పది, యుఎఇ దిరామ్స్ 500, యూరోడాలర్స్ ఐదు వచ్చాయన్నారు. లెక్కింపు పర్యవేక్షణాధికారిగా కందుకూరు గ్రూప్ వన్ దేవాలయాల అధికారి వై బైరాగిచౌదరి హాజరైనట్లు తెలిపారు.

మున్సిపాలిటీ ఎదుట నిరసన

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్

నెల్లూరుపాలెం సమీపంలో ఉన్న టిడ్కో భవనాలలో నివసిస్తున్న వారికి తాగునీటి సమస్య, పారిశుధ్య సమస్య ఉందని వాటిని తీర్చమంటూ స్థానికులు ఆత్మకూరు మున్సిపాలిటీ ఎదుట నిరసన చేపట్టారు. వీరి నిరసనకు మద్దతుగా సిపిఎం నేతలు డేవిడ్ రాజు, గంటా లక్ష్మీపతి, మద్దతు పలుకుతూ నిరసనలో పాల్గొన్నారు. తమ సమస్యలు పరిష్కరించమంటూ నినాదాలు చేస్తూ కార్యాలయం ఎదుట బైఠాయించారు. వీరి సమస్యలు పరిష్కరించాలని ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబునును కోరుతూ.. ఆయనను కార్యాలయం నుండి బయటకు వెళ్లకుండా సిపిఎం నేతలు అడ్డుకున్నారు. కార్యాలయం ఎదుట ఓ దశలో అధికారులకు నిరసన తెలపడానికి వచ్చిన పార్టీ నేతలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కార్యాలయం ఎదుట పరిస్థితి ఉధృతంగా మారడంతో పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని చక్కదిద్దారు. కమిషనర్ రెండు రోజుల్లో ఇంజనీర్‌ను పిలిపించి సమస్య పరిష్కరించే దిశగా కృషి చేస్తానన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తనిఖీ

ప్రజాశక్తి-పొదలకూరు

మండలంలోని మహమ్మదాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం నెల్లూరు డివిజన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.ఎల్. దయాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మహమ్మదాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు రమేష్ , నరసింహారావు , 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

మండలంలోని ఇస్కపాలెం గ్రామంలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గహ విద్యార్థులకు శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

జెబిలో వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి-కావలి : డాక్టర్ డిఆర్ విశ్వోదయ బాలల దినోత్సవం సందర్భంగా డాక్టర్ రామ్ సెంటర్ ఆధ్వర్యంలో జవహర్ భారతి యం.యం హాలులో శుక్రవారం సాంస్కృతిక కార్యక్రమాలు, రెండవ రోజు వక్తృత్వ పోటీలు, ఏకపాత్రాభినయాలు నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయకుమార్ రెడ్డి, రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహరరెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, ఆర్గనైజర్ జ్యోతిశ్రీ పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా జె.కృష్ణ ప్రసాద్, కె.రాజగోపాల్ రెడ్డి, శిరీష, పి.నారాయణ, హరికృష్ణ, నల్లూరు రామకృష్ణ వ్యవహరించారు. అధ్యాపకులు అమ రావతి, భార్గవ్, సహాయ సహకారాలు అందించారు.


ఘనంగా యూనియన్ బ్యాంక్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-పొదలకూరు: పట్టణంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో శుక్రవారం 104వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. బ్యాంకు మేనేజర్ డి హరికృష్ణ మాట్లాడారు. బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ బి.బాలకృష్ణ, సిబ్బంది కల్పన, భాస్కర్, తేజస్విని, వేణు, ఖాతాదారులు పాల్గొన్నారు.

వెంకటాచలం : యూనియన్ బ్యాంక్ 14వ వార్షికోత్సవం స్థానిక స్వర్ణ భారత్ యూనియన్ బ్యాంక్ బ్రాంచ్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ మేనేజర్ దీపక్ మాట్లాడారు. అసిస్టెంట్ మేనేజర్ వినోద్, స్వర్ణ భారత్ ట్రస్ట్ సిఇఒ వేణుగోపాల్, సిబ్బంది గాయత్రి, పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన గుంటుపల్లి దంపతులు

ప్రజాశక్తి-కావలి : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌బాబుని శుక్రవారం సీనియర్ నాయకులు గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరి, గుంటుపల్లి శ్రీదేవి చౌదరి దంపతులు కలిశారు. బాపట్ల, పల్నాడు జిల్లాలకు ఆర్ టిఎస్ రాష్ట్రట్రైనర్‌గా వివిధ నియోజకవర్గాల్లో ఆమె చేస్తున్న కార్యక్రమాలను లోకేష్‌కి వివరించారు. విశేషంగా ఆదరణ వస్తున్న ఆర్ టిఎస్ కార్యక్రమం ఇలాగే కొనసాగించాలన్నారు.




మాట్లాడుతున్న సర్వేయర్ పి.శాంత

రీ సర్వేపై శిక్షణ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి వారి ఉత్తర్వుల ద్వారా మండల స్థాయి స్వామిత్వ శిక్షణా తరగతులను శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఇందులో భాగంగా మండల సర్వేయర్ పి.శాంత అలాగే మండల ఇఒపిఆర్‌డి టి.ఉషారాణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండలంలోని అన్నీ సచివాలయాల నుంచి పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఒలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, విలేజ్ సర్వేయర్స్, డిజిటల్ అసిస్టెంట్స్ పాల్గొని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్ఆర్ జగనన్న భూ హక్కు, భూరక్ష పథకంలో భాగంగా గ్రామ పంచాయతీలోని అగ్రికల్చర్‌ను సర్వే చేసి ఆన్లైన్లో నమోదు చేయడానికి అనుసరించే విధానం గురించి అవగాహన కల్పించారు. విఆర్ఒలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సంగం ఎంపిడిఒ కార్యాలయంలో ఇఒపిఆర్‌డి అప్పాజీ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే శ్రీనివాసులు జగనన్న శాశ్వత భూ హక్కు, భూ సురక్ష కార్యక్రమంపై శుక్రవారం సచివాలయం సిబ్బందికి శిక్షణా నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఒలు, అసిస్టెంట్లు పాల్గొన్నారు.



కలిగిరి : మండలం లో ఎంపిడిఒ కార్యా లయంలో ఎంపి డిఒ ఆర్.కళాధర్ ఆధ్వర్యంలో శుక్రవారం జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకంలో భాగంగా స్వామిత్వ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల సర్వేయర్ షేక్ కౌసర్ పాల్గొన్నారు.

అల్లూరు : ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు-భూ రక్ష పథకంపై శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అధికారి మృదుల పాల్గొని ప్రసంగించారు. ఎంపిడిఒ శ్రీదేవి, డిప్యూటీ తహశీల్దార్ చెంచయ్య, ఎంఇఒ నాగేశ్వరరావు, ఇఒపి ఆర్‌డి పెంచల వీరేంద్ర, తదితరులున్నారు.

సీతారామపురం : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకంపై అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ షేక్.షాజియా బేగం మాట్లాడారు. సదస్సులో ఇఒపిఆర్‌డి ఎన్.భార్గవి, తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లిగూడూరు: భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం ఉండకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం సమగ్ర సర్వే ప్రక్రియ చేపట్టినట్లు తహశీల్దార్ హమీద్ పేర్కొన్నారు. పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో స్వమిత్వ వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్షపై అవగాహన కార్యక్రమం జరిగింది.

ఉదయగిరి : జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్షణపై ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్, తహశీల్దార్ సానా శ్రీనివాసులు రెడ్డి అవగాహన కల్పించారు. శుక్రవారం స్త్రీ శక్తి భవనంలో ఒక్కరోజు శిక్షణను నిర్వహించారు. ఇఒపిఆర్‌డి మల్లికార్జున, సర్వేయర్ రవికుమార్, పంచాయతీ ఇఒ నరసయ్య, తదితరులున్నారు.

కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు

I.P. No. 8 / 2020

కొత్తూరి తేజస్వీ, వగైరా - పిటిషనర్లు
Vs
సాధినేని శ్రీనివాసులు, వగైరా - రెస్పాండెంట్లు

To,
R1. సాధినేని శ్రీనివాసులు, తండ్రి **అయ్యవారప్ప నాయుడు,** 10వ వార్డు, కోటారెడ్డి నగర్, కందుకూరు టౌన్, మున్సిపాలిటీ, పాత ప్రకాశం జిల్లా, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

ఈ ఐ.పి.లో 1వ రెస్పాండెంటు అయిన మీ అడ్రస్ తెలియకపోవడం వలన శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం తే20.10.2022 దిన పేపర్ ప్రకటనకు ఆర్డరు వేసివున్నారు. ఈ ప్రకటన వివరముల ప్రకారం 1వ రెస్పాండెంటు అయిన మీరు స్వయముగా గానీ ప్లీడరు గారి ద్వారా గాని తే05-12-2022 దిన పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించెదరని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

వాయిదా తేది : **05-12-2022**

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
ఇట్లు
వి. శ్రీధర నాయుడు, బి.కాం., బి.ఎల్.,
అడ్వకేట్, కందుకూరు

IN THE COURT OF THE SPECIAL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS EXCISE COURT:: ONGOLE
CRL M.P.No. 3326/2018
in
M.C.NO. 05/2017

మునగశెట్టి శ్రీలక్ష్మి & మరొకరు .....పిటిషనర్లు
వర్సెస్
మునగశెట్టి మహేష్ ....రెస్పాండెంట్

To
మునగశెట్టి మహేష్,తండ్రి వెంకట సుబ్బయ్య, ఎ.సి. మెకానిక్, హిందువు, వయస్సు 28 సం.లు, పంచాయతి ఆఫీసు ఎదురు, కొమరిక గ్రామం, ఇందుకూరుపేట మండలం, యస్.పి.యస్.ఆర్. నెల్లూరు జిల్లా.

నోటీసు

పై నెంబరు పిటీషనులోని పిటీషనర్లు, రెస్పాండెంటు అయిన నీ నుండి భరణము తాలూకు రావలసిన మొత్తం కోరుచూ Crl.M.P.No. 3326/2018 in M.C.NO.05/2017 పిటీషను దాఖలు చేయగా, నోటీసు నిమిత్తము నీకు కోర్టు నుంచి ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించి ననూ, జారీకానందున పై కోర్టువారు నీకు పేపరు ప్రకటన ద్వారా జారీ చేయించమని ఉత్తర్వులు ఇచ్చినందున నీకు నోటీసు నిమిత్తము తేది. 15-11-2022 కి వాయిదావేసినారు. కావున ఆ రోజున ఉదయం 10-30 ని.లకు నీవు స్వయంగా కానీ, అడ్వకేటు ద్వారా కాని పైకోర్టు వారి ఎదుట హాజరు అయి నీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలసినది లేనియెడల ఆరోజు నీ పరోక్షమునందు విచారించి పిటీషనర్లు వేసిన సదరు పిటీషన్ ను మంజూరు చేయుటకు తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(**కోర్టువారి అనుమతితో**)

ఒంగోలు **సాయన ఆంజనేయులు**
తేది : **09.11.2022** పిటీషనర్ల తరపున న్యాయవాది,
జిల్లా కోర్టు ఎదురు, ఒంగోలు,
సెల్ నెం. **9440333969**